క్లుప్తంగా

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన గుగులోతు ఐశ్వర్య జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి తృతీయస్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బోరవానిలో జరిగిన 36వ జూనియర్ జాతీయస్థాయి నెట్‌బాల్ ఫాస్ట్‌ఫైవ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరపున ఐశ్వర్య పాల్గొని తృతీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్, నవీన్‌కుమార్, పీఈటీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



నెల్లికుదుర్ సెంటర్: ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ అనుబంధ ఆశవర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌ఈఓ రామకృష్ణకు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. ఆశలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు రజిని, రేణుక, జ్యోతి, చంద్రకళ, విజయ, నాగలక్ష్మీ, పార్వతి, రమ, ఉపేంద్ర, శారద, యశోద పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షురాలిగా పూజా బాయి

నెల్లికుదుర్ సెంటర్: సేవాలాల్ సేన మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన బానోత్ పూజా బాయిని నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్య స్రవంతి మంగళవారం తెలిపాడు.

ఖమ్మం సభను విజయవంతం చేయాలి

తొర్రూరు: విప్లవ పార్టీల ఆధ్వర్యంలో మార్చి 3న ఖమ్మంలో జరిగే జాతీయ సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సభ విజయవంతం కోరుతూ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు, ఊడుగుల రాములు, అనిల్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు

కేసముద్రం: నిరుద్యోగ యువతీయువకులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ల్యాండ్ సర్వేయర్ డిపెండెంట్ ట్రైనింగ్ కింద 3నెలల శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారి ఎఫ్సీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి ట్రైనింగ్‌లో అభ్యర్థులకు ఉచితంగా యూనిఫాం, మధ్యాహ్న భోజనం, న్యాక్ నుంచి స్కిల్ సర్టిఫికెట్‌తోపాటుగా కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు.

పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న అపరిచిత, గుర్తు తెలియని వాహనాలను గుర్తుపట్టిన యజమానులు సంబంధిత పత్రాలు చూపించి తీసుకెళ్లాలని ఏఆర్ ఆర్ఐ (ఎంటీఓ) సోములు మంగళవారం తెలిపారు. 10 రోజుల గడువులో ధ్రువపత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలన్నారు. ఏపీ20వీ 8109 ఆటో బజాజ్ త్రీ వీలర్, ఏపీ20 ఏజే 2048 టూ వీలర్ బజాజ్ ప్లాటిన, ఆటో బజాజ్ త్రీ వీలర్, ఏపీ36ఎం 4637 టూవీలర్ టీవీఎస్ సెంట్రా, ఏపీ20ఎన్ 4544 టూ వీలర్ హోండా యూనికాన్, ఏపీ200 5914 టూ వీలర్ సుజుకీ, టూ వీలర్ బజాజ్ డిస్కవర్ చాయిస్ నంబరు ఎండీఅండ్‌డీ ఎస్‌పీఏజెడ్‌జెడ్‌టీడబ్ల్యూడీ 61654 గల వాహనాల వివరాల కోసం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎంటీఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వాహనాల తనిఖీ

మహబూబాబాద్ రూరల్: ప్రజల ప్రాణాలను రక్షించాలని ఉద్దేశంతో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తారని టౌన్ ఎస్సై చల్లా అరుణ అన్నారు. మంగళవారం రాత్రి టౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు వాహనదారులు నిబంధనల మేరకు వాహనాలు నడపకపోవడంతో స్టేషన్ తరలించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో టౌన్ ఎస్సై తేజావత్ రామారావు, హెడ్ కానిస్టేబుల్ సంపత్ రెడ్డి, పీసీలు దేవేందర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

భూఅక్రమార్కులను వదిలేది లేదు

- ఎమ్మెల్యే మురళీనాయక్



నెల్లికుదురు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు: ప్రజల సమస్యలు పరిష్కరించడానికే నేరుగా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం గ్రామానికి మంగళవారం స్థానిక నాయకులతో చేరుకున్న ఎమ్మెల్యేకు ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పూర్ణకుంభంతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. సాగు భూములకు పట్టాలు, అక్రమంగా ఆక్రమించుకున్న చెరువు, కుంటల భూములు, తక్కువ పట్టా భూములు ఉండి ఎక్కువ భూమిని పట్టా చేయించుకున్న అక్రమార్కుల భరతం పట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని గ్రామ పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే ఒక్కొక్కటిగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని, భూఅక్రమార్కులు ఎంతటి వారైన వదిలేది లేదని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం

కేసముద్రం: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మంగళవారం ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు. ధరణిని రద్దు చేసి, పేదల భూములను తిరిగి వారికి అప్పగిస్తామన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఆపించి, నిజమైన బాధితులను గుర్తించి, వారికి లబ్ధి జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నిశాంత్‌కుమార్, కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, మల్లేశం బాలు, సొసైటీ డైరెక్టర్లు శ్రీను, నంద పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్



నెల్లికుదురు: వాడవాడలా ప్రచారం చేస్తున్న నాయకులు

నెల్లికుదురు: కార్పొరేట్‌సంస్థల కొమ్ముకాస్తూ.. మతతత్వ విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కార్మికులు, కర్షకులకు ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న పిలుపునిచ్చారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపడుతున్న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని సొల్ల తండా, శనిగకుంట తండాలల్లో కాడెడ్లతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, యాకోలు, నాగన్న, యాకన్న, మైబు, రాము, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ఈనెల 16 వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన అఖిలపక్షం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సక్రు, కవిత తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతు ఇవ్వాలి

డోర్నకల్: బీజేపీ పాలన నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా గ్రామీణ సడక్ బంద్‌కు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేషం కోరారు. బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు.

‘గృహజ్యోతి’ నమోదు పరిశీలన



కురవి: గృహజ్యోతి నమోదును పరిశీలిస్తున్న డీఈఈ సునీత

కురవి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గృహజ్యోతి పథకంలో భాగంగా చేపడుతున్న నమోదు కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఈ సునీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఈఆర్‌ఓ కార్యాలయంలో మీటర్ రీడర్స్‌తో ఉచిత విద్యుత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం మీటర్ రీడర్స్ వినియోగదారుల ఇళ్లకు వచ్చి నమోదు చేస్తారని తెలిపారు. వినియోగదారులు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ రమేష్‌బాబు, ఏఈలు జయప్రకాశ్ నారాయణ, శారద, మీటర్ రీడర్ సూపర్‌వైజర్ కట్ల వెంకన్న, లైన్ ఇన్‌స్పెక్టర్లు కేదారి, ఈర్యా, జితేందర్, లైన్‌మెన్‌లు శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

గార్ల: గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొందే లబ్ధిదారులు విద్యుత్ బిల్లు రీడింగ్ తీసేందుకు ఇంటికి వచ్చిన విద్యుత్ సిబ్బందికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తెలియజేయాలని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు మంగళవారం సూచించారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

దంతాలపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లపై చర్యలు తప్పవని ఎస్సై రామేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నర్సింహులపేట, మద్దిరాల, మరిపెడ మండలాల నుంచి అక్రమ ఇసుక దందా జోరుగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్య తీసుకుంటామని ఆయన తెలిపారు.

మాజీ సర్పంచ్‌లకు సన్మానం

మరిపెడ రూరల్: మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి, బాల్నిధర్మారం గ్రామాల సర్పంచులు చేసిన ప్రజాసేవలు అభినందనీయమని ఆయా గ్రామాల ప్రజలు కొనియాడారు. మంగళవారం మండలంలో మాజీ సర్పంచ్‌లు నాతి కృష్ణ, దార ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలను సన్మానించారు.

నిరుపయోగంగా చేతి పంపులు

- మరమ్మతులు చేపట్టాలని ప్రజల విన్నపం



అబ్బాయిపాలెంలో నిరుపయోగంగా చేతిపంపు

మరిపెడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో చేతి పంపులు నిరుపయోగంగా ఉన్నాయి. సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోలేవడం లేదు. దీంతో వేసవి కాలం మొదలవుతున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ గ్రామీణుల దాహం తీర్చేది మాత్రం చేతి పంపులే. మరిపెడ మండలం 44 గ్రామ పంచాయతీల్లో సుమారు 602 చేతి పంపులు ఉన్నాయి. ఇందులో 503 చేతిపంపులు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ మరో 50 చేతిపంపులు సీజనల్ (వర్షాకాలం) మాత్రమే పని చేస్తాయి. మిగిలిన 49 చేతి పంపులు పడావు పడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో తాగు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు కలుషితమవుతుందని, చేతి పంపు నీళ్లే సురక్షితమని పలుగ్రామాల ప్రజలు చెబుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే మండలంలోని అన్ని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: ఆర్టీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కన్నం నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఆర్టీఓకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఈనెల 16న భారత్‌బంద్ అన్ని కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ సంపూర్ణంగా నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గిద్దల రమేష్ , పట్టణ అధ్యక్షుడు షాజహాన్, సభ్యులు శ్రీను, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

గూడూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో రైతు కూలీ, మోటార్ రంగ కార్మికులకు ఎంతో అన్యాయం జరుగుతుందని ఈ నెల 16వ తేదీన తెలంగాణ మోటార్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ జాయింట్ యాక్షన్ కమిటీ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నామని మండల జేఏసీ సభ్యులు ఎస్కే ఆదిల్‌పాషా, అశోక్, పడాల నాగరాజు, కృష్ణ అన్నారు. మంగళవారం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముత్యం రవి, కడారి రవి, నలమాస కర్ణాకర్, సంజయ్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్, బాల్కసుమన్ దిష్టిబొమ్మలను మంగళవారం దహనం చేశారు. అనంతరం బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసముద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నుంచి నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తుండటాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే, జైలుకు పంపడం ఖాయమని ఆయన హెచ్చరించాడు. - సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: ఇనుగుర్తిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంజయ్య, తదితరులు



గూడూరు: మాట్లాడుతున్న కత్తి స్వామి



దంతాలపల్లి: ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

దర్గాలో జెండా పండుగ



పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు


కేసముద్రం: కేసముద్రంస్టేషన్ శివారు జమలాపురంలోని సద్గురు హసన్‌చిస్తీ, మాతా సకీన దర్గాలో, 47వ ఖాజా గరీబ్ నవాజ్ చిస్తీ అజ్మీర్ జెండా పండుగ వేడుకలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకు నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా నిర్వాహకులు ఎండి.నసీరుద్దిన్ చిస్తీ ఊరేగింపుగా గరిబ్ నవాజ్ జెండాను దర్గా వద్దకు తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తెల్లవారుజామున ఆరిఫ్ వరంగల్ ఆధ్వర్యంలో ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్యగౌడ్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, సూఫీ గురువులు మతీన్, నిజాం పాల్గొన్నారు.

నర్సింహులపేటలో దొంగల భయం

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- భయపడుతున్న ప్రజలు

నర్సింహులపేట: నర్సింహులపేట మండల కేంద్రంలో ఇళ్లకు తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి ఇళ్ల తాళాలను పగలగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. 6నెలల క్రితం గ్రామంలో తాళాలు వేసి హైదరాబాద్‌కు వెళ్లిన పలువురి ఇళ్లలో దొంగలు పడి దోచుకెళ్లారు. కొందరి ఇళ్లలో వస్తువులను, మరికొందరి ఇళ్లలో ఏమి లేకున్నా బీరువాలు ధ్వంసం చేస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసి బంధువులు, కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. మండల కేంద్రంలో పోలీసులు, బజారుల్లో సీసీ కెమెరాలు ఉన్నా దొంగల హల్‌చల్‌పై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

‘భూమిని ఆక్రమించడం సరికాదు’



నిరసన తెలుపుతున్న రైతులు

తొర్రూరు రూరల్: చెరువు శివారు భూమిని ఆక్రమించడం సరికాదని దళితరత్న గుండాల నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బర్ల చెరువు శివారు భూమిని ఆక్రమించుకోవడం సరికాదని, అతనిపై చర్య తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని పంటసాగు చేసుకోవడం దారుణమని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అతనిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు యాకేందర్, యాదయ్య, వెంకన్న, వెంకటనర్సు, నాగార్జున, శోభన్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 9, 10 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సెస్సీ విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. మంగళవారం కురవి, నేరడ మోడల్, హైస్కూల్, మోద్గులగూడెం, సీరోలు, కాంపల్లి హైస్కూల్స్‌లో టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జ్యోతిబసు, వీరేందర్, మహేష్, వినయ్, ప్రవీణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

మరిపెడ రూరల్: పుట్టిన రోజు, ప్రతి శుభకార్యాలకు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడాన్ని ప్రతీ ఒక్కరు అలవాటు చేసుకోవాలని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుడు జర్పుల కాలునాయక్ అన్నారు. మండలంలోని బాల్యతండాలో మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ అజ్మీర జిక్కినారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ బానోతు హరినాయక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బానోతు పాప, బానోతు వీరన్న, హరి, దస్‌సింగ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే అధికారులకు తెలియజేయాలి

బయ్యారం: తమ పరిధిలో ఎక్కడైనా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే ఆరోగ్య సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేయాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ అరుణ అన్నారు. బయ్యారంలోని పీహెచ్‌సీ ఆవరణంలో ఆరోగ్య, ఆశకార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. గృహహింస, బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కళాజాతా

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెంలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై కళాజాతా నిర్వహించారు.

కొండచిలువ హతం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సాలార్ తండా ప్రాంతంలో భారీ కొండ చిలువను వాహనదారులు, స్థానికులు చంపేశారు. సోమవారం రాత్రి కొండ చిలువ స్థానిక హనుమాన్ దేవాలయ సమీపంలో రోడ్డుపై నుంచి వెళ్లడాన్ని స్థానికులు, అటువైపుగా వెళ్తున్న వాహనదారులు గమనించి చంపేశారు.

కనీస వేతనం అమలు చేయాలి

మరిపెడ: ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, అసియాబేగం, ఉపేంద్ర, సునీత, శారద, లలిత పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

కురవి: సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.వెంకన్న సొంత ఖర్చులతో మంగళవారం ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ గిరిజనులకే ఇవ్వాలి

డోర్నకల్: మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని గిరిజనులకు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్ కోరారు. డోర్నకల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం, వివిధ కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని తెలిపాడు.

అవినీతి ఆరోపణలు అర్థరహితం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో నిధుల దుర్వినియోగం, అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపాడు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో రూ.50కోట్ల పనుల్లో అవినీతి జరిగిందని, నిధులు దుర్వినియోగం అయ్యాయని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నారని, త్వరలో విచారణలో వాస్తవాలు తెలుస్తాయన్నారు.

సునీల్‌రెడ్డికి పరామర్శ

కురవి: రాష్ట్ర ప్రభుత్వ భూ సమస్యల సలహాదారుడు, ధరణి కమిటీ సభ్యుడు ‘భూమి’ సునీల్‌రెడ్డి తండ్రి మేక సంజీవరెడ్డి సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం కురవి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సంజీవరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సునీల్‌రెడ్డిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, నాయకులు ఉమా పిచ్చిరెడ్డి, తోటలాలయ్య, జ్యోత్స్నవెంకటరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోర్నకల్: మండలంలోని జోగ్యతండాకు చెందిన ఆంగోత్ సేవ్య (45) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సేవ్య మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో తరచూ గొడవలు చేసేవాడని తండావాసులు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం ఇంట్లో భార్యతో గొడవ జరగగా ప్రమాదవశాత్తు జారిపడడంతో సేవ్యాకు గాయాలయ్యాయి. గాయాలైన సేవ్యను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్సైలు ఝాన్సీ, సంతోష్ రావు మృతుడికి ఇంటికి చేరుకొని విచారణ చేపట్టారు.

స్వయం పరిపాలన దినోత్సవం



కేసముద్రం: మండలంలోని రంగాపురం గ్రామంలో గల యూపీఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన సురేఖ టీచర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల శ్రీధర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, రాజ్‌కుమార్, సంతోష్, అశోక్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.